
# ప్రతిబింబం

— యర్రగుంట్ల సూర్యమూర్తి

కాంతిరేఖ అస్తమించింది అన్నవార్తవిని సినీ ప్రేక్షకులు విలవిలలాడిపోయేరు. జనంలో ఓ సంచలనం కలిగింది. కాంతిరేఖ ఎందుకు చనిపోయింది? ఆమె సహజంగా చనిపోయిందా లేక ఎవరైనా ఆమె యందు కక్షబూని ఆమెను హత్య చేశారా? పోలీసులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఒకటి మాత్రం నిర్ధారణగా తేలింది. ఆమె సహజంగా చనిపోలేదు. ఆమె రాత్రి తాగిన విస్కీలో బాగా నిద్రమాత్రలు కరిగించి ఉన్నాయి. ఆమె మరిపొద్దున్న లేవలేదు. అలా కోమాలోకి పోయి ఆ మరునటి రోజున పదిగంటలకు మరణించింది.



కాంతిరేఖకు మన రాష్ట్రంలోని ప్రతి ఊళ్ళో ఓ అభిమాన సంఘం ఉంది. పడుచుపిల్లలున్న ప్రతి గృహంలో దాదాపుగా ఆమె ఫొటో ఉన్న కాలెండర్లు న్నాయి. యువకులకు ఆమె ఆరాధ్యదేవత. యువతులకు ఆమె ఒక మోడల్. ఆమె వేష భాషల్ని అనుకరించని స్త్రీలు అరుదు. అంతటి సౌందర్యం ఆమెది.

ఆమె గొప్ప నటీమణి. ఆమె దక్షిణాది భాషల నాల్గింటా సినిమాలలో నటించింది. ఆమె ఇతరులచేత తన మాటల్ని డబ్బింగ్‌కి ఒప్పుకునేది కాదు. స్వల్పకాలంలో తనే ఆ దక్షిణాది భాషను నేర్చుకుని, ఏ యాసాలేకుండా సంభాషణలను చెప్పేది. అరువు గొంతుకంటే ఆమెకు ఏవగింపు. ఆమె స్వరం కూడా ఆమె రూపుకు మల్లే మధురంగా ఉండేది.

ఓ పది హిందీ చిత్రాలలోనూ నటించింది. మంచిపేరు ప్రఖ్యాతులను పొందింది. ఇక దక్షిణాది భాషా చిత్రాలెన్నిటిలో నటించిందో ఆమె లెక్కపెట్టుకోవడం మానేసి చాలా కాలమైంది. ఆమె ఆర్జన ఎంతో ఆ ఇన్‌కంటాక్స్ వాళ్ళే పసిగట్టలేకపోయారు. మొత్తం మీద ఆమె విచ్చలవిడిగా ఖర్చు చేసినా ఆమె చనిపోయిన నాటికి సుమారు తొంభై లక్షలుండొచ్చు అని ఆమె భర్త అంచనా. ఆమె చనిపోయిన నాటికి ఆమె వయస్సు ఏభై సంవత్సరాలు. ఆ వయస్సులోనూ ఆమె అందంగానే ఉండేది.

ఆ ఇంట్లో ఉన్నది ఏడుగురు మనుష్యులు. కాంతిరేఖ, ఆమె భర్త శశికుమార్, ఆమె పరిచారిక చంద్రిక, బజారు పనికి, తోటపనికి నౌకరు రామయ్య, వంట మనిషి శాంతమ్మ, గిన్నెల్ని కడగడం ఇంటిని శుభ్రంగా ఉంచడం లాంటి చిల్లర పనులకు కాంతం, గేట్ వాచ్‌మన్ రాంసింగ్. ఆమె మరణానికి కారణం ఎవరైనా కావచ్చు. పోలీసులు అనుమానితులందర్నీ ప్రశ్నించారు, కాని ఏ ఆధారమూ దొరకలేదు.

ఆమె ఆత్మహత్య చేసుకుంది అనుకోడానికి, పోలీసులకు తగిన కారణం దొరకలేదు. ఆమెకు బోలెండత ఐశ్వర్యముంది. అందమైన భర్త ఉన్నాడు. వారిద్దరి మధ్యా అన్యోన్యతే గాని ఏభేదాభిప్రాయాలూ లేవు. ఆమె ఆరోగ్యం చాల బాగుందని ఆమె ఫామిలీ డాక్టరు దొరైస్వామి చెప్పాడు.

కాంతిరేఖ మూడు వివాహాలు చేసుకుంది. ఆమె మాజీ భర్తలిద్దరూ సినిమాలలో హీరో వేషధారులే. ఆమెతో వారికెప్పటికీ స్నేహభావమే గాని వైరమేమీ లేదు. ఆమె ప్రస్తుత భర్త మాత్రం సినీ నటుడు కాదు.

ఆమె ఇంట్లో పనివాళ్ళంతా ఆరోగ్యంగా తీరుగా రూపురేఖలతో ఉన్నవాళ్ళే. ఎవ్వరూ కురూపులూ, వృద్ధులూ కారు. కాంతిరేఖకు తన చుట్టూ అందం ప్రతిఫలిస్తూ ఉండాలి. ఆ విషయాన్ని పోలీసు ఇన్‌స్పెక్టర్ గమనించాడు. ఆ ఇంట్లో అందరిలోకీ పెద్ద వయస్సువాడు నౌఖరు రామయ్యే. అతడి వయస్సు నలభై ఎనిమిది. మిగతా వాళ్ళంతా ముప్పై, నలభై మధ్య వయస్సున్న వాళ్ళే. ఆమె భర్త శశికుమార్ సుమార్ నలభై ఏళ్ళ వయస్సు వాడు. ఆమె కన్నా బాగా చిన్నవాడు.

పోలీసులు ఆమె ఎడ్వకేటు గురునాథం గార్ని కలిసి ఆమె వీలునామా గురించి ప్రశ్నించారు.

"ఆమె చాలా మంచిది, సహృదయురాలు. ఆమె ఆస్తిని మూడు భాగాలుగా చేసి, ఒక భాగం ఆమె భర్త శశికుమార్‌కి, మరో భాగం ఆమెను నమ్ముకున్న ఆమె ఇంట్లో వున్న ఐదుగురు పనివాళ్ళకు, మిగిలిన భాగం సినీ కళాకారుల సంక్షేమ సంఘానికి రాసిచ్చింది, తన వీలునామాలో".

"ఆమె చనిపోవడానికి కారణాన్ని మీరేమైనా ఊహించగలరా?"

"నాకూ అంతు చిక్కడం లేదండి. ఆమె చనిపోవాల్సిన అగత్యమేమీ లేదు. మరి ఎవరేనా ఆమెను చంపేసారనుకుందామంటే ఆమెకు శత్రువులు ఎవ్వరూ లేరండి. ఆమె భర్త అంతటి సాహసం చేస్తాడనుకోను. అతడు నెమ్మదస్తుడే. కాంతిరేఖ అంటే అతనికి ఎంతో అనురాగం.



**సినిమా హీరోలే లెక్కా**

'రాజేంద్రప్రసాద్ 109వ జయంతి' - వార్త.

"రాజేంద్రప్రసాద్‌కు 109 సంవత్సరాలా? ఎవరైనా నవ్వేపోతారు!" అంది పంకజ తల్లితో.

"రాజేంద్రప్రసాద్ అంటే మీ సినిమా హీరో కాదే తల్లీ! మాజీ భారత రాష్ట్రపతి." సరిదిద్దింది ఆ యారమ్మా కూతుర్ని.

జి.రఘుపతిరాం



**ఖరీదు**

'సెంటు' పదివేల రూపాయలా! అంత ఖరీదైన పెర్‌ఫ్యూమ్ అన్నమాట.

"పెర్‌ఫ్యూమ్ కాదు నా బొంద! స్థలం ఖరీదది.

జి.రఘుపతిరాం

పోలీసులకు దొరికిన ఆధారం ఒక్కటే. ఆమె పడక గదిలోని డ్రెస్సింగ్ టేబిల్ నిలువుటద్దం ముక్కలై వుంది. బరువైన మయూరి నాట్య బొమ్మ ఆ ముక్కల మధ్య పడి ఉంది.

పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆ ఇంట్లో పని మనిషి కాంతాన్ని ప్రశ్నించాడు.

"ఆయమ్మగారికి విరోధులెవరూ లేరండి. అయ్యగారికి రేఖమ్మగారంటే ప్రేమేనండీ" అంది.

ఆమె చెప్పిన విధానంలో ఇన్‌స్పెక్టర్‌కి ఏదో సంశయం గోచరించింది.

"ఆమె భర్త ఆమె కన్నా వయస్సులో చాలా చిన్నవాడుగా తోస్తున్నాడు కదా, మరి వారిరువురి మధ్యనా ఏ గొడవలు లేవా?"

"వాళ్ళు తగవులాడుకోడం నేనెపుడూ చూడలేదండి. కాని అయ్యగారు ఆ చంద్రికతో అప్పుడప్పుడూ సరసాలాడడం నేను చూశానండి" అని యజమానురాలి పెర్సనల్ పరిచారిక చక్కని చంద్రిక గుట్టురట్టు చేసింది కాంతం.

తరువాత ఆ మృతురాలి భర్త శశికుమార్‌ని ఇన్‌స్పెక్టర్ జీవన్‌రెడ్డి ప్రశ్నించాడు.

"మీ భార్య మీతో సఖ్యంగా ఉండేవారా? మరి మీకు విడిగా బెడ్ రూమెందుకు?"

"అదా- సాధారణంగా నేనూ ఆమె ఆమె పడక గదిలోనే పడుకుంటాం, కాని ఒక్కొక్కప్పుడు షూటింగులనుంచి వచ్చాక ఆమె మూడ్ పాడయి ఉంటుంది. ఏ డైరెక్టర్‌తోనో, ఏ ప్రొడ్యూసర్‌తోనో ఘర్షణ పడి వచ్చినప్పుడు ఆ సమయంలో ఆమె విడిగా పడుక్కునేది. ఆ కోపంలో నన్ను తన గదిలోకి రానిచ్చేది కాదు. మీకు తెలుసుకదా ఈ సినీతారలకు బోలెడన్ని మూడ్సు. వాళ్ళంతా టెంపర్‌మెంట్ జీవులు."

"మిస్టర్ శశికుమార్! మీరు ఏం పని చేస్తుంటారు? మీకు ఆమెతో వివాహమై ఎన్నాళ్ళయింది?

"నేను ఆమెను పెళ్ళాడి సుమారు అయిదేళ్లవుతుంది. నేను మొదట్లో ఓ సినిమా జర్నల్‌కి చీఫ్ రిపోర్టర్‌గా పని చేస్తుండేవాణ్ణి. ఆ విధంగా నాకు సినిమావాళ్ళందరితోనూ పరిచయముండేది. ఓనాడు నేను కాంతిరేఖను ఆ జర్నల్ కోసం ఇంటర్వ్యూ చేశాను. తరువాత నాకు ఆమెతో స్నేహం ఏర్పడింది. ఓ రోజు కాంతిరేఖ నన్ను తనింటికి డిన్నరుకు పిలిచింది. అప్పుడే నన్ను తనను వివాహమాడగలవా? అని అడిగింది. నేనెంతో సంతోషించాను. నేనో అనామకుణ్ణి. నా రూపమే నాకున్న ఆస్తిపాస్తులు. ఆమె నాకన్నా పది పన్నెండేళ్ళు పెద్దయితే మాత్రం ఏం మునిగింది? ఆమె ఆ వయస్సులోనూ అందగత్తె, పేరు ప్రఖ్యాతులున్న నటీమణి; లెక్కలేనంత సంపదా, ఆర్జనా ఉన్నాయి. ఆమెకు భర్తగా నేను అదృష్టవంతుణ్ణే అనిపించి ఒప్పుకున్నాను అలాగే ఇప్పుడు నేను దర్జాగా ఏ చింతా లేకుండా బ్రతుకుతున్నా.

"నేనో సున్నితమైన విషయం గురించి అడగబోతున్నా, మరోలా భావించకండి" అన్నాడు శశికుమార్.

"ఫరవాలేదు అడగండి అన్నాడు ఇన్స్‌పెక్టర్ జీవన్‌రెడ్డి. నా భార్య ఎందుకు చనిపోయిందో తెల్సుకోవాలని నాకెంతే ఆదుర్దాగా ఉంది" అన్నాడు శశికుమార్.

"మీకూ ఆమె పరిచారిక చంద్రికకు సంబంధముందని విన్నాను- నిజమేనా?" సూటిగా ప్రశ్నించాడు జీవన్‌రెడ్డి.

"అవును- మీరు విన్నది నిజమే. ఈ ఇంట్లోని పనివాళ్ళెవరో ఆ విషయాన్ని కనిపెట్టేశారన్న మాట. ఈ

నంగతిని దయచేసి పత్రికల వాళ్ళకి తెలియజేయ కండి. అసలు వాస్తవాన్ని వదిలేసి పత్రికలన్నీ నన్నే హంతకుడిగా చిత్రిస్తాయి" వేడుకొంటున్నట్టుగా పలికాడు శశికుమార్.

"ఫరవాలేదు చెప్పండి"

"నా భార్య సౌందర్య విహీనతను సహించలేదు. అందుకే చక్కదనం లేని పనివాళ్ళను తన దరిదాపులకు రానిచ్చేది కాదు. ఆమె పరిచారిక చంద్రిక అందమైందే; మీరు చూసుంటారు. ఆమె నాకన్నా తొమ్మిదేళ్ళు చిన్నది. నేను ఆమె పట్ల ఆకర్షితుడనయ్యేను. కాదనను. వీలు చిక్కినప్పుడల్లా ఏవో చిన్న చిన్న సరదాలు. కాని మా ఇద్దరికీ కాంతిరేఖ అంటే ఎంతో అభిమానం. కాంతిరేఖ ఒంటిమీద చీమ పాకినా సహించలేము. మమ్మల్ని అనుమానించకండి" అన్నాడు కాంతిరేఖ భర్త శశికుమార్.

"మీది వింత మనస్తత్వం లాగుందే! మీ భార్యను మీరు సెక్స్‌వల్లీ మోసగిస్తూనే ఆమె అంటే ఎంతో ప్రేమ అనడం చిత్రంగా లేదూ! సరే మరొక్క విషయం. మీ భార్య పడక గదిలోని డ్రస్సింగ్ టేబిల్ అద్దం పగిలుంది. ఎలా జరిగింది- ఎప్పుడు జరిగింది?"

"ఏమోనండి- ఆమె చనిపోయిన నాటి రాత్రే ఆ అద్దం ముక్కలై ఉంది. ఎలా చెప్పగలిగానంటే

ఆనాటి మధ్యాహ్నం నేను ఆమె గదిలోకి వెళ్ళేను, అప్పుడు అద్దం పగిలిలేదు."

"పోనీ కారణాన్ని మీరూహించగలరా?"

"ఆమెకు ఎందుకో విపరీతంగా కోపం వచ్చి ఉంటుంది. ఆమెకు గత రెండు సంవత్సరాలుగా ఎక్కువగా సినిమా వేషాలు లేవు. వచ్చినా ఏ పెద్దక్క వేషాలో వస్తున్నాయి. ఆమె ఆ వేషాలకు అప్పుడప్పుడు పెద్ద సంస్థ చిత్రాలైతే ఒప్పుకుంటున్నా ఆమెకు బాధత ప్పడం లేదు".

ఇన్‌స్పెక్టరు ఆలోచనలో పడ్డాడు.

తర్వాత ఇన్‌స్పెక్టరు జీవన్‌రెడ్డి నౌఖరు రామయ్యను ప్రశ్నించాడు.

"ఆరోజు ఎవరో అమ్మగారి చిన్ననాటి స్నేహితురాలట ఒకామె తెనాలి నుంచి వచ్చింది. ఆమె అమ్మగారితో మధ్యాహ్నం ఓ గంటసేపు గడిపి వెళ్ళిపోయింది. మరెవ్వరూ రాలేదు. ఆమె వెళ్ళిన తరువాత సాయంత్రం ఏడు గంటలకు అమ్మగారు నా చేతికి ఓ ఉత్తరం ఇచ్చిపోస్టులో వెయ్యమన్నారు. అంతే నండి ఆరోజు జరిగింది." అన్నాడు రామయ్య.

"మరి ఆ ఉత్తరంపైన అడ్రసు చూశావా? పోస్టులో వేశావా?" ప్రశ్నించాడు ఇన్స్‌పెక్టర్. రామయ్య గతుక్కుమన్నాడు. ఇటు అటు చూడడం మొదలెట్టేడు.

"ఏమిటి సంగతి? ఎందుకా బిత్తర చూపులు - నిజం చెప్పు?" అని ఇన్‌స్పెక్టరు గట్టిగా అడిగేడు.

"క్షమించాలి - పొరబాటు జరిగిపోయిందండి. రెండు రోజుల క్రితం అమ్మగారు నాకిచ్చిన కవరును జేబులో పెట్టుకున్నా ఆరాత్రి పోస్టులో వేసినా, ఆ మరునాడు వేసినా ఒకటేనని. తరువాత అమ్మగారు చనిపోయేరని తెలిసి, ఆ దుఃఖంలో ఆ విషయమే మరచిపోయేనండి. ఆ కవరు ఔటు హవుసులో ఉన్న నాపాత చొక్కా జేబులో ఉండిపోయిందండి". అన్నాడు భయపడుతూ "సరే, వెంటనే ఆ ఉత్తరాన్ని తీసుకురా" ఆజ్ఞాపించాడు ఇన్స్‌పెక్టర్ జీవన్‌రెడ్డి.

రామయ్య గబగబా వెళ్ళి ఆ కవరును తెచ్చిచ్చాడు.

ఆ కవరు తనకు అడ్రసు చేస్తూ జీవన్‌రెడ్డి కేరాఫ్ ఫలానా పోలీస్ స్టేషన్ అని ఉండడం చూసి ఇన్‌స్పెక్టరు జీవన్‌రెడ్డి చాలా ఆశ్చర్యపోయేడు. గబగబా ఆ కవర్ని చించి, ఆ ఉత్తరాన్ని తీసి చదివేడు–

"ఇన్‌స్పెక్టరు రెడ్డిగారూ! నమస్తే. నేనీరాత్రి మరికొద్ది గంటల్లో చనిపోతున్నాను, నా చావుకి ఎవ్వరూ బాధ్యులు కారు. అందుచేత దయచేసి మీరెవ్వర్నీ సందేహించి,హింసించకండి. మీరాశ్చర్యపోతున్నారు కదూ, నేనెందుకు నామరణాన్ని ఆహ్వానిస్తున్నానో? ఇదీ కారణం–

మొన్నటి సాయంత్రం నేను నామాటింగ్ కాన్సిల్ అయి అనుకోకుండా ముందుగా వచ్చేశాను. ఆరోజు నాపరిచారిక చంద్రిక తలనొప్పిగా ఉందని నాతో స్టూడియోకి రాలేదు. నేను ఇంటికి వచ్చి మేడమీద నాభర్త పడకగది దగ్గరకు వెళ్ళేసరికి ఏదినుంచి నాకేవో మెల్లగా మాటలు వినవస్తుంటే, అనుమానం కలిగి కిటికీ లోంచి లోపలకు చూశాను.

నా భర్త శశికుమార్, నాదాసి చంద్రిక సరససల్లాపాల్లో తన్మయత్వం చెందుతున్నారు. "రేఖ అందంగా ఉన్నా ఈ మధ్య కాస్త లావెక్కింది. మునుపటి ఆతీరు ఇప్పుడు ముఖంలోగాని, శరీరంలోగాని లేవు. బహుశా మరో మూడు, నాలుగు సంవత్సరాలకు రబ్బరు బంతిలా అయిపోయి అందమైన ఆ రేఖలన్నీ మాయమవుతాయనుకుంటా?" అన్నాడు నా భర్త. చంద్రిక తలవూపుతూ – "ఆమె మెడ చూశారా ఎంత లావెక్కిందో. అందుకే నేను అమ్మగారికి మరీమరీ చెప్తుంటా తిండి బాగా తగ్గించమని, వారానికి రెండు రాత్రులు భోజనం మానేయమని. అమ్మగారు వినరు కదా? అంది.

వారిద్దరి కలియిక నన్నంతగా బాధించలేదు, కారణ మేమంటే నా మాజీ భర్తలు కూడా అప్పుడప్పుడు పైపై సరదాలకు పోవడం నాకు తెలుసు. నాకన్నా పదేళ్ళు చిన్నవాణ్ణి చేసుకున్ననాడే నేనూహించాను. శశికుమార్ కూడా అప్పుడప్పుడూ చిరుతిళ్ళకు పోతాడని. నేను గత ముప్పై ఏళ్ళుగా ఈ సినీ ప్రపంచంలో పెరిగినదాన్నే. ఇట్లాంటి సంపర్కాలు నాకేమీ కొత్తకావు. కాని నన్ను బాధించింది వారి మాటలు. నేను కొవ్వు బంతినైపోతున్నానని, నా అందం మాయమవుతోందని.

ఈ మధ్యాహ్నం నా ఇంటికి నా చిన్ననాటి స్నేహితురాలు, నాకు ప్రియమైన నా అభిమాని నా వద్దకు వచ్చింది. అప్పుడు ఆ మాటా ఈ మాటా అయిన తర్వాత ఆమె అంది – "సుబ్బులూ! [నా అసలు పేరు వెండి] ముసలి దానవయిపోయేవే! అప్పటి నీ రూపే లేదు. నీ కళ్ళ క్రింద ఆ చారలేమిటి? నీ గుండెలు బాగా బరువెక్కినట్లున్నాయి. నీ నడుమూ బలిసినట్లుంది. ఏ డాక్టరునైనా సంప్రదించకూడదూ సన్నబడడానికి, నీ చర్మానికి మునుపటి కాంతిని రాబెట్టడానికి? నువ్వు జాగ్రత్త తీసుకోకపోతే ఈ తల్లి వేషాలూ వదులుకోవలసి వస్తుంది – జాగ్రత్త!" అని హెచ్చరించిపోయింది.

అంతే! ఆమె వెళ్ళిపోయిన తరువాత నా బెడ్‌రూములో నా డ్రస్సింగ్ టేబిల్ ముందు కూర్చుని నన్ను నేను పరీక్షించుకున్నాను. నా భర్తా, చంద్రికా, నా స్నేహితురాలూ అన్న మాటలు నిజమే అనిపించాయి. నేను దేన్నైనా భరించగలను గాని, నా అందం పోవడాన్ని మట్టుకు తట్టుకోలేను.

ఇన్నాళ్ళూ నా సౌందర్యాన్ని గొప్పగా చూపే ఆ అద్దం, నేడు నన్ను పరిహసిస్తూ నా వికార రూపాన్ని చూపుతుందని విపరీతమైన కోపం వచ్చి ఆ అద్దాన్ని ముక్కలు చేశాను. నా మనసూ వికలమైంది ఆ అద్దంలా. అంతే.

దయచేసి ఈ విషయాల్నేమీ బయట ప్రపంచానికి తెలియజేయకండి. నా చుట్టూ ఉన్నవాళ్ళకి చాలా ఖేదం కలుగుతుంది. నేను నిద్రపట్టక ఆ రాత్రి తాగుడు మైకంలో పొరబాటున ఎక్కువగా నిద్రమాత్రలు వేసుకుని, ఏక్సిడెంటల్‌గా చనిపోయానని మాత్రమే చెప్పండి. మీరూ నా అభిమానే గనుక నా గుట్టును బయటపెట్టకండి – ప్లీజ్! శెలవు - ఇంట్లు కాంతిరేఖ.

ఆమె బ్యూటీ కాన్షస్‌కు విస్తుపోతూ ఇన్స్‌పెక్టర్ జీవన్‌రెడ్డి అలా నిల్చుండిపోయాడు. ●



## అమ్మకానికి మిగలవు?

స్వీటు షాపు ఉన్న ఫ్రెండ్‌తో అన్నాడు సదాశివం.


"నువ్వు ఊళ్లో లేనప్పుడు షాపు మూసేబదులు మీ ఆవిణ్ణి షాపులో కూర్చోబెట్టొచ్చుగా?"

"ఊహు. నాకు అనుమానంరా మా ఆవిడ మీద" చెప్పాడు చిన్నారావు.

"తప్పురా. కట్టుకున్న భార్య శీలాన్ని అలా శంకించకూడదు."

"ఛ! అనుమానం అందుక్కాదురా. స్వీట్లు తినేస్తుందేమోనని."

దుర్గా శేఖర్ [తరగవువలస]



## ఎదురింటి నవల రుచి

ప్రేయసి కాదంబరి ప్రియుడు నిరంజన్‌రావు పార్కులో కూర్చున్నారు. "ఈ చక్కని చల్లని రాత్రి పిండారబోసినట్లుండే వెన్నెలను చూస్తే నీకేమనిపిస్తోంది?" అడిగాడు నిరంజన్‌రావు కాదంబరిని.

"ఛీ ఛీ మీ బుద్దెప్పుడూ ఇంతే? నే రాసిన నవలలు ఆరు ఉండగా ఎదురింటి శ్రీ శారద రాసిన నవలలోని డైలాగులే ఎప్పుడూ చెప్తారు" అంది కాదంబరి.

డి.సత్యమూర్తి [వాడ్రేవువల్లి]